COMMUNIST PARTY OF INDIA (MARXIST)
ANDHRA PRADESH COMMITTEE
H.No. 27-30-3, CPI(M) State Committee Office
Akulavari Street, Governor Pet, Vijayawada -2
☎ 0866 - 2577202, Fax: 0866 - 2577203
E-mail: cpimap@gmail.com

ప్రచురణార్థం/ ప్రసారార్థం:

తేది : 25.12.2015
విజయవాడ

# గిరిజనులను అరెస్టు చేసి సర్కారు అరుకు ఉత్సవాలా?

గిరిజనుల మనోభిప్రాయాలకు వ్యతిరేకంగా, ముమ్మరంగా వ్యవసాయ పనులున్న కాలంలో మరీ ముఖ్యంగా విశాఖ ఏజెన్సీలో బాక్సైట్ తవ్వకాలను తీవ్రంగా వ్యతిరేకిస్తున్న నేపథ్యంలో "అరుకు ఉత్సవాలు- 2015" ను బలవంతంగా నిర్వహించడాన్ని సిపియం తీవ్రంగా ఖండిస్తున్నది. గిరిజనులపై నిర్బంధాన్ని ప్రయోగించి, గిరిజనులను అక్రమంగా అరెస్టు చేయడాన్ని గర్హిస్తున్నది.

బాక్సైట్ తవ్వకాలపై రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసిన 97నెం.జి.వో.ను రద్దు చేయకుండా, గత ప్రభుత్వ జి.వోను రద్దుచేస్తున్నట్లు అసెంబ్లీలో ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రకటించడం గిరిజనులను, రాష్ట్ర ప్రజానీకాన్ని మోసం చేయడమే అవుతుంది. గిరిజన ప్రాంతంలో బాక్సైట్ తవ్వకాలతో సహా విద్య, వైద్యం, వ్యవసాయం, త్రాగునీరు సమస్యలతో పాటు ఎన్నో తీవ్రమైన సమస్యలు ఉన్నప్పటికీ వాటిని పరిష్కరించకుండా కాంట్రాక్టర్లను సంతృప్తి పర్చేందుకు, గొప్పల కోసం అరుకు ఉత్సవాలను నిర్వహించడం సరికాదు. అరుకు ఉత్సవాలు నిర్వహించడానికి గిరిజన ప్రాంతంలో ఇది సరైన సమయం కాదని, ఉత్సవాలను వాయిదా వేయమని అన్ని రాజకీయ పార్టీలు, గిరిజన సంఘంతో సహా, వివిధ ప్రజా, ఉద్యోగ సంఘాలు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేసినా పెడచెవినపెట్టి నిర్బంధంగా ఈ ఉత్సవాలను నిర్వహించడం వెనుక ఆంతర్యం ఏమిటో అర్థంకావడంలేదు.

ఉత్సవాల నిర్వహణపై ప్రజాస్వామ్యబద్ధంగా నిరసన తెలుపుతున్న గిరిజన ప్రజలు, నాయకులపై ఈరోజు అరుకులో విచక్షణారహితంగా పోలీసులు కొట్టడం, అరెస్టు చేయడం చంద్రబాబు ప్రభుత్వ నియంతృత్వ ధోరణికి పరాకాష్ట. మొన్న భోగాపురం ఎయిర్‌పోర్టు నిర్వాసితులపై, నిన్న అంగన్‌వాడీలపై, నేడు గిరిజనులపై ఇలా ఈ ప్రభుత్వం వ్యవహరిస్తున్న తీరు ప్రజాస్వామ్యానికి గొడ్డలిపెట్టు. ఈ నిర్బంధ చర్యలను ప్రజాతంత్రవాదులంతా వ్యతిరేకించాలని విజ్ఞప్తి చేస్తున్నాం.

**(పెనుమల్లి మధు)**
రాష్ట్ర కార్యదర్శి